
సాక్షి
కాకినాడ

శనివారం । 1 । మార్చి । 2025



వాసవీమాతకు పూజలు

రాజానగరం: రావుల చెరువు గట్టున కొలువు తీరిన వాసవీ కన్యకా పరమేశ్వరికి శుక్రవారం గ్రామ మహిళలు 108 పసుపు కొమ్ములతో అష్టోత్తరం చేసి, కుంకుమార్చనలు నిర్వహించారు.



8,970 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి కాలువలకు 8,970 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

రంజాన్ వేళలు

	సహర్ ఆదివారం (ఉదయం)	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)
రాజమండ్రి	5.01	6.18
కాకినాడ	5.02	6.17
అమలాపురం	4.59	6.18

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్ నిర్వహించండి

సాక్షి, న్యూఢిల్లీ: ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్ నిర్వహించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఎన్డీఏ (టీడీపీ) కూటమి అభ్యర్థికి గట్టి పోటీ ఇస్తాననే ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన నాయకులతో ఎన్నికల అధికారులు కుమ్మక్కై తన నామినేషన్‌ను కుట్ర పూరితంగా రిజెక్ట్ చేసి పోటీలో లేకుండా తప్పించారని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఈనెల 12 ఫిర్యాదు చేశానని.. అయితే అక్కడ న్యాయం జరగకపోవడంతో 25న కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారితోపాటు మిగిలిన అధికారులపై విచారణ జరిపించి తన నామినేషన్‌ను పునరుద్ధరించి ఆమోదించాలని, రీ పోలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ విషయంలో తనకు న్యాయం జరిగే వరకూ పోరాడతానన్నారు.

ఆటల్లో గెలుపు ఓటములు సహజం



పురుషుల విజేత సెంట్రల్ సెక్టార్ జట్టు


నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటల్లో గెలుపు ఓటములు సహజం అని భారత హాకీ మాజీ కెప్టెన్ ధనరాజ్ పిళ్లై పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ పోటీలు ముగిశాయి. ముగింపోత్సవానికి టోర్నమెంట్ చీఫ్ కో–ఆర్డినేటర్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఒలింపియన్, భారత హాకీ జట్టు కెప్టెన్, ఒలింపియన్, ధనరాజ్ పిళ్లై, గౌరవ అతిథిగా ఏపీ, తెలంగాణ ఇన్‌కమ్ టాక్స్ డైరెక్టర్ ఆనంద్ రాజేశ్వర్ భాయ్‌వార్ హాజరయ్యారు. ధనరాజ్ మాట్లాడుతూ పోటీలలో విజేతలుగా నిలిచిన సెంట్రల్ సెక్టార్ జట్టు, ఒడిశా జట్టును ఆయన అభినందించారు. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా 44 జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో సెంట్రల్ సెక్టార్ ప్రథమ, హైదరాబాద్ సెక్టార్ ద్వితీయ, హర్యానా తృతీయస్థానాలు, మహిళల విభాగంలో ఒడిశా మొదటి, సెంట్రల్‌సెక్టార్ రెండవ, హర్యానా మూడవ స్థానాలు గెలుచుకున్నాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ స్పాన్సర్స్‌కు అతిథులు చేతుల మీదుగా మెమెంటోలు ఇచ్చారు. టోర్నమెంట్ కన్వీనర్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి రాహుల్ కుమార్, కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ కుమార్ మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు, జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, జేఎన్టీయూకే స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి శ్యాంకుమార్, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ వ్యవస్థాపకులు రవిచంద్ర, అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు డి.మురళీకృష్ణ, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

బాలాజీచెరువు: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ పరీక్షలకు ఫస్టియర్ చదివే 22,260మంది హాజరుకానున్నారు. పరీక్షలకు అన్ని కళాశాలల నిర్వాహకులను ఇంటర్మీడియెట్ అధికారులు అప్రమత్తం చేశారు. గత ఫిబ్రవరి ఒకటో తేదీన విద్యార్థులకు మానవీయ విలువలు, పర్యావరణ విద్యవంటి అంశాల్లో అవగాహన ఎంత ఉందనేది పరిశీలన చేసే క్రమంలో వార్షిక పరీక్షలకు ముందు వీటిని నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఈ పరీక్ష రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఫిబ్రవరి 5నుంచి ఇంటర్మీడియెట్ ఒకేషనల్ విద్యార్థులకు, 10 నుంచి జనరల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించగా 89 కేంద్రాల్లో 21,871మంది హాజరయ్యారు. థియరీ పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు జరుగుతున్నంత సేపు కేంద్రాల్లో జరిగే ప్రతి కదలికను నిశితంగా పరిశీలించేలా సీసీ కెమెరాల లైవ్ కొనసాగేలా సాంకేతికతను వినియోగించనున్నారు. వీటిని ఆర్ఐఓ కార్యాలయంతో పాటు ఇంటర్మీడియెట్ కేంద్ర కార్యాలయం నుంచి పరిశీలిస్తారు. జిల్లావ్యాప్తంగా మొదటి,రెండవ సంవత్సరం కలిపి 44,131 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

జీబీఎస్ వ్యాధిగ్రస్తుడు డిశ్చార్జి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో వారం రోజులుగా చికిత్స పొందుతున్న జీబీఎస్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి కోలుకున్నాడు. అతనిని పూర్తి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్ది శుక్రవారం డిశ్చార్జి చేసినట్టు వైద్యాధికారులు వెల్లడించారు. జీజీహెచ్‌లో మరో ముగ్గురు జీబీఎస్ బాధితులకు వైద్యసేవలు కొనసాగుతున్నాయి.



సముద్ర కోతకు గురవుతోన్న ఉప్పాడ



పిఠాపురం రాపర్తి వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ఏలేరు (గొర్రికండి)

ఇదేమి కేశవా!

- బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు నిల్
- ఏలేరుకు కన్నీరే మిగిల్చారు
- సుద్దగెడ్డపైనా చిన్నచూపే
- పంపాకు నిధులు లేకపోయె
- ఉప్పాడ కోత ఊసే లేదు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలకు అశనిపాతంగా మారింది. చంద్రబాబు అంకెల గారడీ బడ్జెట్‌లో స్పష్టమైందని వివిధ వర్గాలు ఆక్షేపిస్తున్నాయి. ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్‌లో నీటిపారుదలతో పాటు అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తే జిల్లాకు లబ్ధి చేకూరుతుందని అంతా ఎదురుచూశారు. తీరా బడ్జెట్ లెక్కలు చూస్తే నిరాశ పరిచిందంటున్నారు. జిల్లాలో మెట్ట ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని రైతులు కళ్లలో ఒత్తులు వేసుకుని చూశారు. అందునా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గం కాకినాడ జిల్లాలో ఉండటంతో పలు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు దండిగా ఉంటాయని లెక్కలేసుకున్నారు. పవన్ మాటల్లో తప్ప చేతల్లో కార్యాచరణ కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఏదీ రైతు కళ్లలో ఆనందం?

అధికారంలోకి వచ్చిన వెంటనే ఏలేరు ఆధునీకరణ పూర్తి చేసి 53 వేల ఎకరాల ఆయకట్టు రైతుల కళ్లలో ఆనందాన్ని చూస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. తీరా ఏలేరు ఆధునీకరణకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేక చేతులెత్తేశారని రైతులు ఆక్షేపిస్తున్నారు. ఐదు మండలాల పరిధిలో సుమారు 40వేల మంది రైతుల సమస్య పవన్‌కు కనిపించ లేదా అని నిలదీస్తున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలనే ఆలోచన లేకుండా పోయిందా అని రైతు సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. సుద్దగడ్డపై కూడా చిన్నచూపేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రత్తిపాడు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి, మండలాల పరిధిలో 30 గ్రామాలు, 35 వేల ఎకరాలు ముంపు బారిన పడుతూ ఏటా రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్ల మేర నష్టపోతున్న సుద్దగడ్డకు చిల్లిగవ్వ కేటాయించకపోవడాన్ని నిలదీస్తున్నారు. పంపా బ్యారేజీ ఆధునీకరణకు బడ్జెట్‌లో చోటు దక్కక 15వేల ఎకరాల్లో ఆయకట్టు రైతులు నిరాశకు గురయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబుసాగర్‌లకు కేటాయింపులు లేవు. పవన్ ఉప ముఖ్యమంత్రి కావడంతో మేలు జరుగుతుందనుకుంటే బడ్జెట్‌లో మెట్ట ప్రాంతంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని రైతులు మండిపడుతున్నారు.

ఉప్పాడ వాసుల డీలా

ఉప్పాడ సముద్ర కోతకు శాశ్వత నివారణపై పవన్ ఇచ్చిన హామీకి బడ్జెట్‌లో చోటు దక్కకపోవడంపై మత్స్యకారులు మండిపడుతున్నారు. చెన్నై జియలాజికల్ సర్వే బృందాన్ని తీసుకువచ్చి పవన్ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. కాకినాడ–తుని తీరం వెంబడి 1978లో నిర్మించిన బీచ్‌రోడ్డు 28 సార్లు సముద్రకోతకు గురైంది. ఈ రోడ్డు కోత నివారించడంతో పాటు తీరం శాశ్వత రక్షణ చూస్తానని పవన్ ఇచ్చిన మాట రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిఫలిస్తుందని ఉప్పాడ వాసులు ఎదురుచూసి డీలా పడ్డారు. జిల్లాలో 1,74,229 మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలంటే రూ.174.225 కోట్లు అవసరం. బడ్జెట్‌లో కేటాయింపులు అరకొరగా ఉండటంతో అందరికీ అందడం అనుమానమేనంటున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అని ఊరించిన చంద్రబాబు బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడాన్ని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కాకినాడ జిల్లా ప్రజా రవాణా పరిధిలో 300 బస్సుల్లో నిత్యం 80వేల మంది ప్రయాణిస్తుంటే సగం మంది మహిళలే.. అంటే 40వేల మంది ప్రయాణిస్తారు. వీరికి ఉగాది నుంచి ఉచిత బస్సు ప్రయాణం లేనట్టేనంటున్నారు. మహిళలకు రూ.1,500లు ఇస్తానన్న చంద్రబాబు.. అరకొరగానే కేటాయింపులు చేయడంతో ఈ పథకం అటకెక్కినట్టే. నిరుద్యోగ భృతి రూ.3,000 అంశంలో దగా చేసినట్టేనంటున్నారు. జిల్లాలో యువత 3.15 లక్షల మంది ఉన్నారు.

ఏలేరుకు బడ్జెట్‌లో చోటు లేదే



ఏలేరు వరద వచ్చి పంటలు నీట మునిగి పొలాల్లో ఇసుక మేటలు వేసింది. వేరే పంట వేసే అవకాశం లేకుండా పోయింది. కాలువలకు పడిన గండ్లు పూడ్చ లేదు. వరదలో మునిగి నష్టపోయిన ఇళ్లకు పరిహారం ఇవ్వలేదు. ఏలేరు ఆధునీకరణకు గతంలో మా భూమి తీసుకున్నారు. దానికి పరిహారం ఇవ్వలేదు. భూమిని ఇవ్వడం లేదు. పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చాం. అయినా పట్టించుకోవడం లేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశపడ్డాం. అదీ లేదు. ఇక ఈ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచినట్టే.

– ముప్పిడి శ్రీనివాసరెడ్డి, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం.



పవన్ ఉండి ఉపయోగం ఏమిటి?



విద్యా, వైద్య సామాజిక రంగాలపై దృష్టి లేదు. గత బడ్జెట్ కన్నా 2 శాతం మాత్రమే ఎక్కువ. పెరిగే ధరలతో పోలిస్తే బడ్జెట్‌లో సామాజిక రంగాలకు న్యాయం జరగలేదు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడింది. కౌలు రైతులకు కేటాయింపులు లేవు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు సరిగా లేవు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల విషయంలో నోరు మెదపడం లేదు. జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉండి ఏం లాభం. పూర్తిగా వ్యవసాయ వ్యతిరేక బడ్జెట్‌లా ఉంది.

– తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కాకినాడ

నిరుద్యోగులకు కుచ్చు టోపీ



రాష్ట్ర బడ్జెట్‌లో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. గద్దెనెక్కిన మరుక్షణమే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాట ఇచ్చారు. ఉద్యోగాలు ఇవ్వకుంటే నెలనెలా రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఆ మాటలు నమ్మి ఓటేశాం. తీరా పూర్తి స్థాయిలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చూస్తే నిరుద్యోగ భృతికి చోటు దక్కక పోవడం అన్యాయం. తల్లికి వందనం పథకంలో కేటాయింపులు చూస్తుంటే విద్యార్థుల సంఖ్యకు, కేటాయింపులకు పొంతన లేకుండా ఉంది.

– పెంకే రవితేజ, జిల్లా నిరుద్యోగ జేఏసీ ప్రతినిధి, కాకినాడ.

తీర ప్రాంతానికి తీరని అన్యాయం



సముద్ర కోతకు గురవుతోన్న ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు నిధులు కేటాయించకపోవడం అన్యాయం. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ నిధుల మాట లేకపోవడం దారుణం. నాడు కోతకు గురవుతోన్న ప్రాంతాన్ని పరిశీలించిన సందర్భంలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం బడ్జెట్‌లో నిధులు వస్తాయని ఎదురు చూశాం. అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించకపోవడం నిరాశ కలిగించింది.

– ఉమ్మిడి జాన్, మత్స్యకార నాయకుడు, ఉప్పాడ

ఘనంగా కవిశేఖర ఉమర్ ఆలీషా జయంతి

కాకినాడ రూరల్: పిఠాపురంలోని విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠం 6వ పీఠాధిపతి బహుముఖ ప్రజ్ఞాశాలి కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 140వ జయంత్యుత్సవం కాకినాడ సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఠం కాకినాడ ఆశ్రమ శాఖ ఆధ్వర్యంలో పీఠం కన్వీనరు పేరూరి సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహానికి నవమ పీఠాధిపతి ఉమర్ ఆలీషా సద్గురువు సోదరులు అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహాకవిగా, శతావధానిగా, తత్త్వవేత్త, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా, పీఠాధిపతిగా డాక్టర్ ఉమర్ ఆలీషా సేవలందించారన్నారు. మాతృ భాష తెలుగు కాకపోయినప్పటికీ తెలుగులో అద్భుతంగా సాహిత్య సంపద సృష్టించారన్నారు. కవిశేఖర ఉమర్ ఆలీషా 1885 ఫిబ్రవరి 28న జన్మించారని, ఆయన జయంతి తమకు పండగ లాంటిదన్నారు. ప్రముఖ పేరడీ గాయకుడు బలరామకృష్ణ తన పాటలతో అలరించారు. ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ షా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, రిటైర్డ్ ఆర్టీఓ రామచంద్రరావు, స్థానిక పీఠం కన్వీనర్ యల్లమాంబ, కాకినాడ లక్ష్మి, రెడ్డి సూర్య ప్రభావతి, వనుము మణి, బాదం లక్ష్మికుమారి, వీరభద్రరావు, రెహ్మాన్ కవి శేఖర డాక్టరు ఉమర్ ఆలీషా గురించి వివరించారు.



ఉమర్ ఆలీషా విగ్రహానికి నివాళులర్పిస్తున్న అహ్మద్ ఆలీషా, హుస్సేన్ షా

చంద్రబాబు వంచన బయటపడింది

- రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేలా బడ్జెట్
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కన్నబాబు

కాకినాడ రూరల్: చంద్రబాబు ప్రజలను ఏ విధంగా వంచిస్తారో బడ్జెట్‌లో కేటాయింపులే సాక్ష్యం. రాష్ట్ర బడ్జెట్‌ను ప్రజలకు పనికి వచ్చే విధంగా గాని, వారికి మంచి చేయాలనే సంకల్పంతో గాని రూపొందించలేదని, ఉన్నది లేనట్టుగా ఏదో జరుగుతున్నట్టుగా రంగుల కలలా తయారు చేశారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఎంతసేపూ పొగడ్తలే తప్ప, ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలనే ఆలోచనతో బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, మరో మంత్రిని పొగిడి స్వామిభక్తిని చాటుకున్నట్టుగా ఆర్థికమంత్రి కేశవ్ ప్రసంగం ఉంది. చంద్రబాబు సంక్షోభం నుంచి అవకాశాలు సృష్టించుకుంటానని చాలాసార్లు చెబుతారు, కానీ రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేసే పద్ధతిలో బడ్జెట్‌లో కనిపించింది. ఒకపక్క రైతాంగం తీవ్రమైన ఇబ్బందుల్లో ఉండి, సంక్షోభంలో కూరుకుపోతున్నారు. మిర్చి, టమాటా, వరి రైతులు ఇబ్బందులు పడుతుండడంతో మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద కేవలం రూ.300 కోట్లు కేటాయించడమనేది వారి చిత్తశుద్ధి, రైతులకు ఇచ్చిన ప్రాధాన్యం అర్థమవుతుంది. కల్లబొల్లి కబుర్లు చెప్పి బయట పడాలని చూశారు. తొలి బడ్జెట్ పేలవంగా ఉంది. ప్రభుత్వం ప్రజల సంక్షేమం విషయంలో చేతులెత్తేసినట్టు కనిపిస్తోంది. ప్రధానంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా కనిపించడం లేదు. కొన్ని హామీలకు అరకొరగా నిధులు కేటాయించి, కొన్నింటి ఊసే ఎత్తలేదంటే ఈ ఏడాది వాటి జోలికి వెళ్లడం లేదని అర్థమవుతోంది' అన్నారు.



కురసాల కన్నబాబు

సంక్షేమ సారథిగా జగన్‌మోహన్‌రెడ్డి పది మెట్లు పైకి..

'బడ్జెట్ చూస్తే జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా మరో పదిమెట్లు పైకి ఎక్కినట్టుగా కనిపిస్తోంది. చెప్పినవి చెప్పినట్టుగా ప్రతి బడ్జెట్‌లో నిధులు కేటాయించి లబ్ధిదారులు సంఖ్యతో సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి కొత్త ఒరవడికి జగన్ శ్రీకారం చుడితే.. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేనట్టుగా అయ్యింది. మరోపక్క పెద్ద ఎత్తున గతంలో అప్పులు చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు అప్పుల వివరాలు పొందుపరచకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో తల్లికి వందనం, దీపం, పెట్టుబడి సాయం వంటి పథకాలకు కేటాయించిన నిధులు చూస్తే లబ్ధిదారుల సంఖ్యను దారుణంగా కుదించారని అర్థమవుతోంది. జగన్‌ను దూషించడానికి... చంద్రబాబు, లోకేష్‌ను పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేయడానికి చూపిన శ్రద్ధ బడ్జెట్ రూపొందించడంలో కనిపించలేదు. గత ప్రభుత్వం బాకీలు మేము తీర్చామని ఆర్థిక మంత్రి ప్రకటించారని, గత ప్రభుత్వం బకాయిలు తీర్చడం ప్రభుత్వ బాధ్యత. 2019లో జగన్ అధికారంలో వచ్చిన తరువాత చంద్రబాబు పెట్టిన బకాయిలు తీర్చుకుంటూ వచ్చారు. ప్రభుత్వం అనేది కంటిన్యూయస్ ప్రాసెస్. బకాయిలు తీర్చామని చెబుతున్న మీరు ఎవరెవరికి బిల్లులు చెల్లించారో ప్రకటించగలరా. ఇప్పటికి చిన్నచిన్న పనులు చేసిన ఎంతోమంది బిల్లులు రాక నలిగిపోతున్నది వాస్తవం కాదా అని మేము అడుగుతున్నాం.' అని కన్నబాబు ప్రశ్నించారు

కమిషనరా.. కార్యకర్తా?

- పాడాకు గెస్ట్‌హౌస్ కేటాయించడంపై కౌన్సిలర్ల ఆందోళన
- కమిషనర్ కనకారావు తీరుకు నిరసనగా చైర్మన్ పోడియం వద్ద బైఠాయింపు
- అనుమతులు రద్దు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం

పిఠాపురం: కౌన్సిల్ ఆస్తిని కౌన్సిల్‌కు తెలియకుండా వేరే వాళ్లకు ఎలా రాసిచ్చారు? మీరు కమిషనరా పార్టీ కార్యకర్తా అంటూ పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావుపై కౌన్సిలర్లు మండిపడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ శీరం శ్రీరామ చంద్రమూర్తి మృతికి సంతాపం సూచకంగా కౌన్సిలర్లు మూడు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశం ప్రారంభించగానే వైఎస్సార్ సీపీకి చెందిన 25 మంది కౌన్సిలర్లు మున్సిపల్ అతిథి గృహాన్ని పిఠాపురం డెవలప్‌మెంట్ అథారిటీకి కౌన్సిల్ అనుమతి లేకుండా ఎలా ఇచ్చారో సమాధానం చెప్పాలని కమిషనర్ కనకారావును ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గెస్ట్ హౌస్‌ను పాడాకు కేటాయించామని ఆయన తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు కౌన్సిల్ ఆస్తిని కౌన్సిల్‌కు తెలియకుండా వేరే వాళ్లకు ఎలా రాసిచ్చారు? అసలు రాసివ్వడానికి మీరెవరు అంటు నిలదీశారు. అయితే గెస్ట్‌హౌస్ ఖాళీగా ఉండడంతో ప్రభుత్వ కార్యాలయానికే కాబట్టి ఇవ్వాల్సి వచ్చిందంటూ కమిషనర్ సమాధానం చెప్ప డంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు కమిషనర్ తీరుపై నిరసనకు దిగారు. చైర్మన్ పోడియం వద్ద బైఠాయించిన కౌన్సిలర్లు పాడాకు కేటాయించిన అనుమతులు రద్దు చేయాలని పట్టుబట్టారు. రద్దు చేస్తూ తీర్మానం చేయాలని ఆ తీర్మానాన్ని ప్రస్తుత సమావేశం ఎజెండాలో పెట్టాలని అప్పటి వరకు తాము ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. కౌన్సిలర్లు ఆందోళన చేస్తున్నా కమిషనర్ ఏమీ పట్టించుకోకుండా వ్యవహరించడంతో మీరు కమిషనర్‌గా కాకుండా కూటమి నేతగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శించారు. నా వెనుక ఉప ముఖ్యమంత్రి , జిల్లా కలెక్టర్ ఉన్నారన్న ధీమాతో ప్రజలు ఎన్నుకొన్న కౌన్సిలర్లను లెక్క చేయకుండా స్వయంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని కమిషనర్‌ను దుయ్యబట్టారు. మున్సిపల్ గెస్ట్‌హౌస్‌ను పాడాకు కేటాయించిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్మానం సమావేశంలో ప్రవేశపెట్టాలని కోరుతూ కౌన్సిలర్లు సంతకాలు చేసి చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే ఈ తీర్మానాన్ని ఎజెండాలో జత చేయగా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం సుదీర్ఘంగా మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



చైర్మన్ పోడియం వద్ద బైఠాయించిన కౌన్సిలర్లు

పంచింది కొంత... పంచుకున్నది ఎంత?

- ప్రలోభాల వెనుక పంపకాల గోల
- ఓటర్లకు డబ్బులు పంపిణీపై కూటమి నేతల్లో గుసగుసలు
- డబ్బు పంపిణీ బయటపడిందన్న సాకుతో మొత్తం నొక్కేశారని ప్రచారం

పిఠాపురం: పంచింది రూ.లక్షల్లో అయితే నొక్కేసింది రూ.కోట్లలో ఉండొచ్చని కూటమి నేతల్లో వినిపిస్తున్న గుసగుసలు పిఠాపురంలో హాట్ టాపిక్‌గా మారాయి. గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పిఠాపురంలో టీడీపీ నేతలు డబ్బు పంపిణీ చేసిన వైనం రచ్చకెక్కిన సంగతి తెలిసిందే. డబ్బు పంపిణీ పేరుతో పోలింగ్ రోజు వరకు కొందరు నేతలు తమ జేబులు నింపుకున్నారన్న చర్చ జరుగుతోంది. 30 మంది ఓటర్లకు ఒకరు చొప్పున కొందరు చోటా నాయకులను ఎంపిక చేసి ఆయా ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేలా చేసినందుకు ఒక్కో చోటా నాయకుడికి రోజుకు రూ.1,000 చొప్పున ముట్టజెప్పిన నేతలు ఆ పేరుతో భారీగా వెనకేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గురువారం ఓటర్లకు డబ్బు పంచుతూ టీడీపీ నేత సోషల్ మీడియాకు చిక్కడంతో అసలు పంపిణీ చేసింది ఎంత? ఎంతమందికి ఇవ్వాలని డబ్బు తెచ్చారు? అనే విషయాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. మీకు ఖర్చులు ఇస్తాం రండి అంటూ దూర ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించిన కూటమి నేతలు తీరా వారు వచ్చి ఓటు వేశాకా మీరు ఎక్కడి నుంచి వచ్చారో మాకేం తెలుసు అంటూ ఖర్చులు ఇవ్వకుండా తప్పించుకున్నట్టు హైదరాబాద్ నుంచి వచ్చిన ఒక ఓటరు పోలింగ్ కేంద్రం వద్ద వాపోయినట్లు తెలిసింది. వారం రోజుల క్రితమే దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను గుర్తించమని వార్డు స్థాయి నేతలను అధినేతలు ఆదేశించారు. ఇదే అదనుగా కొందరు వార్డు స్థాయి నేతలు తమ జేబులు నింపుకున్నారని అంటున్నారు.

కావాలనే వీడియో బయట పెట్టారా?

కేవలం కొందరు నేతలు మాత్రమే డబ్బు పంపిణీ బాధ్యతలు తీసుకుని అరకొరగా పంపిణీ చేసి పెద్ద మొత్తంలో పక్కదోవ పట్టించారని కూటమి వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం, పార్టీ అభ్యర్థికి అనుమానం రాకుండా ఉండాలనే కావాలనే డబ్బులు పంచుతున్న వీడియోను బయట పడేలా చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. తక్కువ మందికి పంపిణీ చేసి ఎక్కువ మందికి ఇచ్చినట్టు చూపించడం ద్వారా ఎక్కువ మొత్తం కొట్టేయాలనే ఆలోచనలో భాగంగా కొందరికి పంపిణీ చేసి తాము నిజంగా పంపిణీ చేసినట్లు బయటకు తెలిసేలా చేసిన ఒక ప్రయోగంగా బయటపడిన వీడియో గురించి చెప్పుకుంటున్నారు. ఒక విధంగా టీడీపీ నేత డబ్బు పంపిణీ చేస్తూ దొరికి పోవడం సమాజంలో ఒక గుర్తింపు ఉన్న పట్టభద్రులను అవినీతి పరులుగా సమాజానికి తెలియజేసే విధంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది ఇలా ఉంటే నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహించాల్సిన ఎన్నికల అధికారులు ఇంత బహిరంగంగా డబ్బు పంపిణీ బయటపడినా ఏమి పట్టనట్టుగా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అంటున్నారు రాజకీయ వేత్తలు.